ప్రజాశక్తి

సోమవారం 17 నవంబర్ 2025

5

పార్వతీపురం మన్యం

చలి పులి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో గత కొద్ది రోజులుగా చలి తీవ్రత మొదలు కావడంతో వృద్ధులు, యువకులు, చిన్నారులు మంటలు వేసుకొని చలి కాన్తున్నారు. వేకువజామున నుండే అనువైన చోట మంటలు వేసి తెల్లవారే వరకు మంటలు కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

చలిమంట కాస్తున్న ప్రజలు

పర్యాటకాభివృద్ధితో మన్యం ప్రగతి సాధ్యమా?

జలపాతాల వద్దకు వెళ్లడానికి రోడ్లే లేని పరిస్థితి

మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత కరువు

ప్రజాశక్తి - పార్వతీపురం

పర్యాటక అభివృద్ధితో జిల్లా రూపురేఖలు మారిపోతాయన్నంతగా ప్రచారం జరుగుతోంది. పర్యాటకులను ఆకర్షించే సహజ సుందరమైన జలపాతాలు జిల్లాలో బోలెడు ఉన్నాయి. ప్రాచుర్యంలోకి వచ్చిన జలపాతాలు కొన్ని ఉంటే, వెలుగులోకి రానివి కూడా కొన్ని ఉన్నాయి. జిల్లాలో సాలూరు, పాచిపెంట, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో సహజసిద్ధమైన జలపాతాలు ఉన్నాయి. పర్యాటకులను ఆకర్షించేందుకు జలపాతాలొక్కటే ప్రధాన వనరు కాదు. వాటితో పాటు మరికొన్ని ఆకర్షణీయమైన దృశ్యాలు కూడా వుండాలి. అంతేకాకుండా పర్యాటకులు జలపాతాలను వీక్షించడానికి తగిన రవాణా సౌకర్యాలు కూడా ఉండాలి. జిల్లాలో ఉన్న అనేక జలపాతాలను చేరుకోడానికి రహదారులే లేని పరిస్థితి. అరుకు ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందిందంటే అక్కడ చూడ్డానికి పలు ఆసక్తికరమైన దృశ్యాలు ఉన్నాయి. ఆంధ్రా ఊటీగా పిలువబడే స్థాయికి అరుకు ప్రాంతం పర్యాటక అభివృద్ధి సాధించింది. గత కొద్ది నెలలుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించారు. దీని ద్వారా గిరిజన యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఆయన ప్రణాళిక సిద్ధం చేశారు. ఏడాదిలో కార్తీక మాసంలో, వేసవిలో మాత్రమే పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. గిరిజన యువతకు ఉపాధి కల్పించే స్థాయిలో ప్రాచుర్యం పొందిన పర్యాటక ప్రదేశాలు జిల్లాలో పెద్దగా లేవు. సీతంపేటలో గల అడలి వ్యూ పాయింట్‌తో పాటు ఎన్టీయార్ అడ్వాచర్ పార్క్, మరికొన్ని ఆకర్షణీయమైన దృశ్యాలు కొంతవరకు పర్యాటక అభివృద్ధికి దోహదపడతాయి. అలాంటి మౌలిక సదుపాయాలు ఇతర జలపాతాల వద్ద కూడా కల్పించినప్పుడే పర్యాటకుల ఆకర్షణ సాధ్యమవుతుంది. అంతే కానీ జలపాతాల సందర్శన కోసమే పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చే పరిస్థితి లేదన్న చర్చ సర్వత్రా జరుగుతుంది. అన్ని జలపాతాలను ఒకేసారి అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కాకుండా ఒకటి రెండు జలపాతాలను పూర్తిస్థాయిలో ప్రయోగాత్మకంగా అభివద్ధి చేస్తే కొంతవరకు ప్రయోజనం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పాచిపెంట మండలంలోని చాపరాయివలస, సాలూరు మండలంలోని లొద్ద, దళాయివలస వలస జలపాతాల వద్ద ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పించాలి. పర్యాటకులు సులువుగా ఆ ప్రదేశాలకు చేరుకోడానికి అవసరమైన రహదారులు నిర్మించాలి. అంతే కానీ కాలినడకన పర్యాటకులు జలపాతాలను వీక్షించడానికి వెళ్లే పరిస్థితి ఉండదు. రహదారి, విద్యుత్, వసతి సౌకర్యాలు వున్నప్పుడే పర్యాటకుల ఆకర్షణ పెరుగుతుంది. అంతే కానీ ఒక గంట, అరగంట పాటు జలపాతాల్లో ఆనందం పొందడానికి పర్యాటకులు రారనే విషయం గుర్తించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

లొద్ద జలపాతానికి వెళ్లే రోడ్డు దుస్థితి

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలి

జిల్లాలో పర్యాటక అభివృద్ధి జరగాలంటే అనేక ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని మౌలిక సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో చాలా గ్రామాలకు ఇప్పటికీ రహదారి సౌకర్యం లేదు. అనేక గిరిశిఖర గ్రామాల నుంచి డోలీమోతల్లో రోగులను మైదాన ప్రాంతానికి తీసుకొచ్చే పరిస్థితి నెలకొంది. రక్షిత మంచినీటి సరఫరా కూడా అంతంత మాత్రంగానే ఉంది. వాగులు, గెడ్డ నీటినే వినియోగించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఏటా మన్యం జిల్లాలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు రకరకాల ఆరోగ్య సమస్యలతో మృతి చెందుతున్నారు. గిరిశిఖర గ్రామాల్లో విద్య, వైద్యం అందని ద్రాక్ష లాగే ఈనాటికీ మిగిలింది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేని పరిస్థితి కనిపిస్తోంది. విద్యార్థులకు రక్షిత మంచినీటి సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. పదేళ్ల క్రితం నాటి రేట్లతో ఈనాటికీ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ అమలు చేస్తున్నారు. పోషకాహార లోపం, మౌలిక సదుపాయాల కొరత వంటి సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు. పర్యాటక అభివృద్ధితోనే జిల్లా రూపురేఖలు మారిపోతాయనుకోవడం అతిశయోక్తి మాత్రమేనని అభిప్రాయపడుతున్నారు.

మన్యానికి దారేది?

తప్పని డోలి మోతలు

రోడ్డు లేక కాలిబాటే శరణ్యం

మన్యం జిల్లాలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురం మండలంలో గల పలు గిరి శిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో నేటికీ గిరిజనులకు కాలిబాట తప్పడం లేదు. సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణించే వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వారపు సంతలకు వస్తుంటారు. ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు మారుతున్నా ఏజెన్సీలో రోడ్ల స్థితిగతులు మాత్రం మారలేదు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం వెళ్లాలంటే నేటికీ డోలిమోతే శరణ్యం అవుతుంది.

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని 27 పంచాయతీలు ఉన్నాయి. వాడబాయి, శిఖర పాయి, అడ్డంగి జంగిడి భద్ర, వామాసి, దేరుగండ, కప్పకల్లు, వనకాబడి వాడపుట్టి, జోగిపురం, కొండ బిన్నిడి, బయ్యాడ, వల్లాడ తదితర కొండ శిఖర గ్రామాల్లో ఎక్కువ శాతం మంది గిరిజనులు నివసిస్తున్నారు. ఈ గ్రామాలకు నేటికీ రోడ్డు మార్గం లేకపోవడంతో రాళ్లు తేలిన రహదారిపై నడుస్తూ బయట ప్రాంతాలకు వస్తున్న పరిస్థితి. గతంలో కొన్నిచోట్ల రహదారులకు మట్టి వేసి వదిలేయడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొట్టుకుపోయి గుంతలుగా ఏర్పడింది. దీంతో వాహనాల రాకపోకలు అతి కష్టంగా మారింది. ప్రమాదకర స్థితిలో వాహనాలపై ప్రయాణించాల్సిన పరిస్థితి. రోడ్లు అభివృద్ధికి నోచుకోక పోవడంతో గిరిజనులు నేటికీ వెనుకబాటు జీవనం గడుపుతున్నారు. విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు మెరుగుపడని పరిస్థితి.

రోడ్లు అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో గిరి శిఖర గ్రామాల రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. రవాణా సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చి నేరుగా గ్రామాలకు వైద్య సేవలు అందే విధంగా చూడాలి. గిరిజనుల డోలి మోతలకు స్వస్తి పలకాలి.

మొంథా తుపానుకు గండిపడిన గండిపాక ఇజ్జకాయ్ రహదారి

రాళ్లు తేలిన వాడబాయి రహదారి

మండలం లోని తాడికొండ పంచాయతీ వాడబాయి గ్రామానికి వెళ్లే అధ్వానంగా మారింది. లప్పటినుచి 4కిలో మీటర్ల బీటి రోడ్డుకు నిధులు మంజూరైన రోడ్డు నిర్మించకపోవడం ఆదివాసీలకు ఇబ్బందులు తప్పడంలేదు. దీనిపై వేసిన మట్టి రోడ్డు వర్షం వస్తే కొట్టుకుపోతుందని గిరిజన సంఘం నాయకులు ఎం.సన్యాసిరావు ఆవేదన వ్యక్తం చేశారు. కావున అధికారులు స్పందించి వాడబాయికి వెంటనే రోడ్డు నిర్మించాలని కోరారు.

మండంగి రమణ,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి.

రోడ్డు లేక అభివృద్ధికి దూరం

గిరిశిఖర గ్రామాలకు రోడ్డు మార్గం లేక నేటికీ గిరిజనులు కనీస అవసరాలకు నోచుకోక అభివృద్ధికి దూరంగా ఉన్నారు. గ్రామాలకు రోడ్లు వేయండంటూ ఎన్నోసార్లు ధర్నాలు, వినతులు ఇచ్చినా స్పందన అంతంత మాత్రమే. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్లు వేసి అభివృద్ధికి సహకరించాలి.

- ఎం. సన్యాసిరావు,
సిపిఎం మండల నాయకులు

రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న వాడబాయి రహదారి

రైతు బజార్ ఏదీ?

ఖాళీగా ఉన్న డిసిఎంఎస్ స్థలం

ప్రజాశక్తి - పాలకొండ

డివిజన్ కేంద్రమైన పాలకొండ నగర పంచాయతీ పరిధిలో రైతుబజార్ కలగా మిగులుతుంది. ఈ ప్రాంతానికి బజారు అవసరమైనప్పటికీ పాలకులు ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా రైతు బజార్ మాత్రం నిర్మాణానికి నోచుకోలేదు. 2010 నుంచి నాగవంశపు వీధిలో గల డిసిఎంఎస్ స్థలంలో రైతు బజార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు పాలకులు చెబుతున్న నేటికీ నిర్మాణం జరగలేదు. దీంతో పట్టణవాసులు పెదవి విరుస్తున్నారు. 2022లో వైసిపి ప్రభుత్వం హయాంలో ఎకరా 7 సెంట్లు డిసిఎంఎస్ స్థలంలో రైతు బజార్ నిర్మాణానికి శిలాఫలకం వేశారు. రూ.78 లక్షలు నిధులు కూడా మంజూరైనట్లు అప్పటి ఎమ్మెల్యే కళావతి, ప్రస్తుతం ఎమ్మెల్సీ విక్రాంత్ ప్రకటించారు. అయితే ఆచరణలో అమలు కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు, ఇప్పుడున్న కూటమి నేతలు డివిజన్ కేంద్రంలో రైతు బజార్ నిర్మిస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు అమలు కాలేదు

రైతు బజారు కోసం కేటాయించిన స్థలం

రైతులకు నిరాశ

రైతు బజార్ ఏర్పాటైతే తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర వస్తుందని రైతులు భావిస్తున్నారు. పాలకొండతో పాటు వీరఘట్టం మండలంలో కూడా కూరగాయల పంట ఎక్కువ ఉంది. రైతు బజారు లేకపోవడంతో రైతులు దళారులకు తమ పంటను కారుచౌకగా అప్పగించే పరిస్థితి కనిపిస్తుంది. రైతుల వద్ద కారుచౌకగా కొన్న పంటలను దళారీలు ప్రజలకు విపరీతమైన ధరలు పెంచి విక్రయిస్తున్నారు. గత కొంత కాలంగా ఖాళీగా ఉన్న డిసిఎంఎస్ స్థలంపై కొంతమంది కన్ను పడి కబ్జాలకు కూడా పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీన్ని అరికట్టాల్సిన పరిస్థితుల్లో సంబంధిత అధికారులూ లేరు. అలా అని రైతు బజార్‌కు ఈ స్థలాన్ని కేటాయించారన్న చర్చ కూడా జరుగుతుంది.

జీవన్ కుమార్‌ను భుజాన మోసుకుని ఆసుపత్రికి తీసుళ్తున్న తండ్రి

సమాజ మార్పులో యువ రచయితల పాత్ర కీలకం

విజయనగరం కోట : సమాజ మార్పులో యువ రచయితల పాత్ర కీలకంగా ఉండాలని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు సూచించారు. నేటి సమాజంలో పత్రికలు, మీడియా.. పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లడం వల్ల వాస్తవాలు, సమాజాన్ని పట్టిపీడిస్తున్న రుగ్మతలు వెలుగు చూడటం లేదన్నారు. ఈ నేపథ్యంలో కవులు, రచయితలే సామాజిక మార్పులు, పరిణామాలను స్వేచ్ఛగా రాయగలుతున్నారని తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సాహితీ స్రవంతి - జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యాన యువ రచయిత వావిలపల్లి సృజన రాసిన 'ఆనందమాయే సఖి' నవలను విజయనగరంలోని గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి సభ్యులు చీకటి చంద్రికారాణి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ నవలలో కీలకమైన పాత్రధారులంతా కళాత్మకమైన పాత్ర పోషించడం ద్వారా సమాజానికి ఒక మంచి సందేశాన్ని అందించాలనే ఆలోచన కవి సృజనలో అడుగడుగునా కనిపించాయని కొనియాడారు. స్వేచ్ఛ, ఇతర సమస్యలు పేద, ధనిక.. అనే తేడా లేకుండా అన్ని కుటుంబాల్లోనూ ఉన్నప్పటికీ రైతులు, కార్మికులు, శ్రమజీవుల సంఘర్షణ, వారి పోరాటాల నుంచి మాత్రమే సమాజ మార్పు ఉంటుందని వివరించారు. ఈ కీలకమైన అంశాన్ని కవులు, రచయితలు తప్పక గమనంలో పెట్టుకున్ని రచనలు చేస్తే అవి తప్పకుండా సమాజాభివృద్ధికి, చైతన్యానికి తోడ్పాటు అందిస్తాయని అన్నారు. ఎంతో మంది రచయితలు ఉన్నప్పటికీ సామాజిక సమస్యలపై రాసినవారు కొంతమందే ఉన్నారని అన్నారు. ఇటువంటి తరుణంలో సృజన నవయువ ఆశాకిరణంగా కనిపిస్తున్నారని కొనియాడారు.

గిరిజనులకు తప్పని డోలి కష్టాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలో గిరిజనులకు డోలి కష్టాలు తప్పడం లేదు. రోడ్డు మార్గం లేక కాలిబాటే శరణ్యమవుతుంది. అత్యవస పరిస్థితుల్లో అనారోగ్యానికి గురైతే డోలి సాయంతో ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యమందిస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా గుమ్మలక్ష్మీపురం మండలం చినరావికోనకు చెందిన నిమ్మక జీవన్‌కుమార్ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో తల్లిదండ్రులు జీవన్‌కుమార్‌ను భుజాన మోసుకొని నాలుగు కిలోమీటర్ల దూరాన ఉన్న రాయిగడ జమ్ముకు నడుకొని తీసుకొచ్చారు. అక్కడ నుంచి రేగిడి పిహెచ్‌సికి తరలించారు. ఇటీవల కాలంలో ఇదే గ్రామానికి చెందిన యువతులు నిమ్మక కింద్రు, నిమ్మక లలిత అనారోగ్యానికి గురైతే భుజాన ఎత్తుకుని ఆసుపత్రికి తీసుకువెళ్లారు. రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో వైద్యసేవలు, విద్య, రవాణా వంటి మౌలిక సదుపాయాలు లేకుండాపోయాయని గిరిజనులు వాపోయారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా స్పందన లేకపోవడం పట్ల గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

జీవన్ కుమార్‌ను భుజాన మోసుకుని ఆసుపత్రికి తీసుళ్తున్న తండ్రి

ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

- రోడ్లపైనే ధాన్యం బస్తాలు
- దళారులకు విక్రయిస్తున్న వైనం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో రైతులు నూర్పులు చేసిన ధాన్యాన్ని రోడ్లపై టార్పాన్లతో కప్పిదాచుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. తుఫాన్లతో చేతికి వచ్చిన నీట్లో మునిగిన పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మిగిలిన పంట అమ్ముకునేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారోనని రైతులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. రైతులు వరి పంటను యంత్రాలతో కోయించి, నూర్పులు చేసి, ధాన్యం రోడ్డుపై ఆరబెట్టారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతుంది ఇప్పటికే. మండలంలోని పలుచోట్ల 85 కేజీల ధాన్యం రూ.1380 నుంచి రూ.1430 వరకు దళారులు కొంటున్నారు. అంతేకాకుండా ధాన్యాన్ని నూర్పుడి యంత్రంతో నూర్పులు చేసి రైతులు వెంటనే వాటిని లైసెన్స్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. మండలంలో 13,500 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. 3300 ఎకరాల్లో ఎద చల్లారు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాలు కోసం ఎదురుచూస్తున్నారు. అలాగే ఈనెల 20 నుంచి తుఫాను హెచ్చరికలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ప్రకటనలకు తప్ప ఆచరణలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ మద్దతు ధరను రైతులకు అందించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నూర్పు చేసి రోడ్డుపక్కనే అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

రూ.1.88 కోట్లతో వసతిగృహాల మరమ్మతులు

- పక్కాగా మెనూ అమలు
- విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ
- ఎప్పటికప్పుడు తాగునీటి పరీక్షలు
- శుభ్రత కోసం ' స్వచ్ఛ వసతి గృహ'
- ఉత్తీర్ణత శాతం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ
- 'ప్రజాశక్తి'తో సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్యామల ముఖాముఖి

పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.1.88కోట్ల వ్యయంతో వసతి గృహాల మరమ్మతులు చేపట్టామని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్యామల తెలిపారు. ఇందులో 88శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. అన్ని వసతి గృహాల్లో మెనూ అమలు పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉంటోందని, ఎప్పటికప్పుడు తాగునీటి పరీక్షలు చేస్తున్నామని వివరించారు. శుభ్రత కోసం అన్ని వసతి గృహాల్లోనూ 'స్వచ్ఛ వసతి గృహ' అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉత్తీర్ణతా శాతం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆమె ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆమె మాటల్లోనే....

-ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

మన్యం జిల్లాలో ఎన్ని సాంఘిక సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయి?

మన్యం జిల్లా వ్యాప్తంగా 13 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 883 మంది విద్యార్థులు ఉన్నారు. 11 వసతి గృహాలకు సొంత భవనాలు ఉన్నాయి. 11చోట్ల వార్డెన్లు ఉన్నారు. మిగిలిన రెండు (పాలకొండ, వీరఘట్టం) వసతి గృహాలకు ఇన్‌ఛార్జులు పర్యవేక్షిస్తున్నారు. వీరి సంక్షేమం, చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.

మెనూ ఛార్జీలు ప్రభుత్వం ఎంతమేరకు చెల్లిస్తోంది?

స్కూల్ విద్యార్థులకు రూ.1400, కాలేజీ విద్యార్థులకు రూ.1600 చొప్పున మెనూ ఛార్జీలు వస్తున్నాయి. 2022 నుంచి ఇదే రకమైన మెనూ, మెనూ సక్రమంగా అమలు జరిగేందుకు వీలుగా నిరంతర పర్యవేక్షణ ఉంటోంది. నెలలో ప్రతి హాస్టల్‌ను తప్పకుండా తనిఖీ చేస్తున్నాను. లోటుపాట్లను గుర్తించి, వెనువెంటనే సరిచేసే ప్రయత్నం జరుగుతోంది.

మంచాలు, కంచాలు, దుప్పట్లు పూర్తిస్థాయిలో ఉన్నాయా?

అన్ని చోట్ల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మంచాలు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, కంచాలు ఉన్నాయి. ఇటీవల జిల్లా కలెక్టర్ ద్వారా రూ.2లక్షలు సోషల్ రెస్పాన్స్‌బిలిటీ నిధులు విడుదల అయ్యాయి. వాటితో అవసరమైన ప్రతి చోట్ల మంచాలు కొనుగోలు చేశాం. వసతికి కూడా ఇబ్బంది లేదు. అన్ని హాస్టళ్లలోనూ సిక్ రూంలు ప్రత్యేకంగా ఉన్నాయి.

విద్యార్థుల ఆరోగ్యం, రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

దోమల బెడద లేకుండా కిటికీలు, తలుపులకు ఇటీవల ప్రత్యేకంగా మెస్‌లు కూడా అమర్చాం. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటున్నాం. చిన్న అనారోగ్య సమస్య వచ్చినా ఆసుపత్రులకు తీసుకెళ్లి వైద్యులకు చూపిస్తున్నాం. ప్రస్తుతం అంతా ఆరోగ్యంగానే ఉన్నారు. మరుగుదొడ్లు అన్ని చోట్లా సరిపడినన్ని ఉన్నాయి. వాటి శుభ్రతపై ప్రత్యేక దృష్టిపెడుతున్నాం.

రక్షిత తాగునీరు అందిస్తున్నారా?

తాగునీటికి ప్రత్యేంకగా ఆర్‌ఓ ప్లాంటులంటూ లేవు. అందుబాటులో ఉన్న బోరు నీటినే శుద్ధిచేసి అందిస్తున్నాం. ప్రతి శుక్రవారం వాటర్ ట్యాంకులు శుభ్రం చేయిస్తున్నాం. ప్రతి 15రోజులకోసారి నీటిని పరీక్ష చేయిస్తున్నాం. ఇప్పటి వరకు ఎక్కడా నీటి కలుషితం, లేదా తాగడానికి వీలుకాని పరిస్థితులు వంటివి ఎదురవ్వలేదు.

వసతి గృహాల మరమ్మతులు ఎంతవరకు వచ్చాయి?

రూ.1.88కోట్లతో 11వసతి గృహాల్లో మరమ్మతు పనులు చేపడుతున్నాం. ఇప్పటి వరకు 8వసతి గృహాల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిన రెండు చోట్ల పనులు జరుగుతున్నాయి. మరో రెండు హాస్టళ్లు అద్దె భవనాలు కావడం వల్ల వాటికి నిధులు మంజూరు కాలేదనే సమస్య లేదు. ఆయా వసతి గృహాలు కూడా ప్రస్తుతం బాగానే ఉన్నాయి.



'స్వచ్ఛ వసతి గృహ' అంటే ఏమిటి?

'స్వచ్ఛ వసతి గృహ' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని మన్యం జిల్లాలో మా విద్యార్థుల ఆరోగ్య రక్షణ కోసం మేము అమలు చేసుకుంటున్న ప్రత్యేకమైన కార్యక్రమం. ఇందులో భాగంగా ప్రతి ఆదివారం తరగతి గదులు, పడక గదులు శుభ్రం చేయిస్తున్నాం. వంటపాత్రలు ఏరోజుకారోజు శుభ్రం చేయడంతో సరిపెట్టకుండా ఆదివారం ప్రత్యేకమైన శుభ్రత చేస్తున్నాం. వేడినీళ్లతో తోమించడంతో పాటు వాటిని పూర్తిగా ఆరబెట్టడం వంటివి చేస్తున్నాం. విద్యార్థులు కూడా తమ దుప్పట్లు, బట్టలు ఉతుక్కోవడం, ఆరబెట్టుకోవడం, ట్రంకుపెట్లు శుభ్రం చేసుకోవడం వంటివి వాటిపై శ్రద్ధ పెట్టిస్తున్నాం.

ఉత్తీర్ణతా శాతం పంపునకు మీరు చేస్తున్న కృషి ఏమిటి?

గత మూడేళ్లుగా జిల్లాలో పదో తరగతి విద్యార్థుల్లో 99శాతం మంది ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఈ ఏడాది వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తున్నాం. ఇందులో భాగంగా హాస్టళ్లలో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. మేథ్స్, సైన్స్, ఇంగ్లీషు వంటివాటికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెడుతున్నాం.

బిపిఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

బిల్డింగ్ క్రమబద్ధీకరణను భవనాల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 30 వార్డుల్లో మున్సిపల్ టౌన్ ప్లాన్ విభాగం అనుమతుల్లేకుండా 1985 జనవరి నుంచి 2025 ఆగస్టు నెలాఖరు వరకూ కట్టిన నివాస, వాణిజ్య భవన నిర్మాణాలు, ప్లాన్ డివియేషన్ ఉన్న భవన నిర్మాణాలను ఒకేసారి రెగ్యులేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం ఈనెల 14 నుంచి 120 రోజులు అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని సంబంధిత భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ భూములు, దేవాలయాల భూములు, గెడ్డలు, బందలు, మాస్టర్ ప్లాన్ రోడ్లు, పార్కుకు వినియోగించే స్థలాలు, ఓపెన్ స్పేస్‌లో నిర్మాణాలు నిర్మించేవారు ఈ క్రమబద్ధీకరణకు అనర్హులన్నారు. 1997 జనవరి లోపు ఉన్న పాత భవనాలకు 25 శాతం, స్లమ్ ఏరియాల ప్రాంతంలో భవనాలకు 50 శాతం ఫీజులు తగ్గింపు ఉంటుందని, మిగతా సమాచారం కొరకు మున్సిపల్ కార్యాలయం పనిచేయు వేళల్లో సంబంధిత యజమానులు సంప్రదించాలని తెలిపారు.

జంఝావతిపై ప్రభుత్వ భరోసా ఏమైనట్లు : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

కూటమి ప్రభుత్వం పెట్టుబడులకు ఇస్తున్నంత శ్రద్ధ చిన్న చిన్న పెండింగ్ నీటి వనరులపై ఇస్తే రైతులు అభివృద్ధి చెందుతారని, జంఝావతి రిజర్వాయర్‌పై కూటమి ప్రభుత్వం ఎన్నికల భరోసా మరిలేనట్లేనా అని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ దేశానికి రైతే రాజు, రైతే ఈ దేశానికి వెన్ను ముక్క అన్న మాటకు భరోసా లేకుండా ఉందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తే రైతు రెండు, మూడు పంటలు పండించుకొని అభివృద్ధి వైపు నడిచే పరిస్థితి ఉందన్నారు. పెండింగ్ నీటి ప్రాజెక్టుల పనులకు నిధులు విడుదల చేయకపోవడం సాగునీరందక రైతులు దివాళా తీసే పరిస్థితి ఏర్పడిందన్నారు. మండలానికి సంబంధించి జంఝావతి, తోటపల్లి, గుమ్మిడిగెడ్డ, వనకాబడి వంటి రిజర్వాయర్లు పెండింగ్ పనులు పూర్తి చేయకపోవడంతో రైతులు పండించిన పంటలకు నీరందకపోవడంతో చేతికొచ్చిన పంటలు నీరు లేక పూర్తిగా నష్టం జరిగే పరిస్థితి ఉందన్నారు. జంఝావతి ప్రాజెక్టు ప్రారంభించి 50 ఏళ్లు అయినా నేటికీ పూర్తికాలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ జంఝావతి రిజర్వాయర్ పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టి అటు ఒడిశా ప్రభుత్వంతో ఉన్న వివాదాన్ని పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వంలో ఉన్న నాయకులు ఆలోచించాలని కోరారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎ.వెంకంపేట హైస్కూల్ విద్యార్థులకు క్రీడా దుస్తులు పూర్వ విద్యార్థులు వితరణ చేసినట్లు హెచ్‌ఎం ఇ.దేవి తెలిపారు. ఇదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఎల్.రామ, బి.శ్రీను 20 జతలు దుస్తులను అందించినట్లు ఆమె తెలిపారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించేలా తర్ఫీదులు ఇవ్వాలని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు సూచించారు. కార్యక్రమంలో పిఇటి పరుశురాం ఉపాధ్యాయులు పాల్గొన్నారు

గిరిజన యువకుడి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని మరికి పంచాయతీ కొత్త ఊరుకు చెందిన గిరిజన యువకుడు మండంగి భాస్కరరావు మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని, భాస్కరరావు కుటుంబాన్ని ఆదుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు పి.సంగం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం గ్రామంలో మృతదేహంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యానికి బానిసైన మండంగి భాస్కరరావును మద్యానికి దూరం చేస్తామని, ఆరోగ్యంగా పంపుతామని నమ్మబలికి ఒక స్వచ్ఛంద సంస్థ పార్వతీపురం వైకెఎం కాలనీలో ఒక గృహంలో డి- అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందని చెప్పారు. ఆ కేంద్రంలో మూడు రోజుల క్రితం చేరిన భాస్కరరావు శనివారం ఉదయం మృతి చెందాడని వివరించారు. అయితే మృతి పై కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే మృతుడు పేద గిరిజన యువకుడని, అతని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

కళింగ వైశ్యుల సేవలు అందరికీ ఆదర్శప్రాయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కళింగ వైశ్యులు నిర్వహిస్తున్న ఆర్థిక, సామాజిక, ఆధ్యాత్మిక సేవలు అందరికీ ఆదర్శప్రాయమని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఆదివారం సీతారాంపురం మామిడితోటలో జరిగిన కళింగ వైశ్యుల వన సమారాధనకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా కళింగ వైశ్యులు నిర్వహించే కార్యక్రమాలు గమనిస్తుంటే సమాజంపై వారికి ఉన్న బాధ్యత అర్థమవుతుందన్నారు. వ్యాపారాలు చేసుకుంటూ మిగిలిన సమయాన్ని ఆధ్యాత్మిక, సామాజిక సేవలో గడపడం వారికే చెల్లిందన్నారు. పండగ వాతావరణాన్ని తలపించేలా ఈ వనసమారాధనలు నిర్వహించడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఇచ్చిన కళింగ వైశ్యులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని, వారికి ఏ అవసరం వచ్చినా అండగా నిలబడి తన సంపూర్ణ సహాయ సహకారాలతో పాటు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. అనంతరం కళింగవైశ్యులు ఎమ్మెల్యేకు ఘనంగా సత్కరించారు.

గిరిజన జెఎసి ఐక్యతా లోపమే అవమానానికి కారణం

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన జెఎసి నాయకుల మధ్య ఐక్యతా లోపమే ఐటిడిఎ ఆధ్వర్యంలో జరిగిన బిర్సా ముండా జయంతి వేడుకల్లో గిరిజన నాయకులకు జరిగిన అవమానానికి నిదర్శనమని మన్యం జిల్లా హిజ్రాల సంఘం అధ్యక్షులు, గిరిజన నాయకులు ఎ.గీతారాణి అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, గౌరవం కోసం పోరాడే నాయకులు విభేదాలు పక్కనపెట్టి ఒకే వేదికపై నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. బిర్సా ముండా వంటి మహనీయుని జయంతి వేడుకల్లో గిరిజన నాయకులను పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. జిల్లా మొత్తం 600 మంది గిరిజన హిజ్రాలమే ఉన్నామని, కనీసం ఏ కార్యక్రమాలు జరిగినా తమకు సమాచారం కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా గిరిజన సంఘాలు, నాయకులు పరస్పర విభేదాలను విస్మరించి ఐక్యంగా పనిచేస్తే ఇలాంటి అవమానాలు పునరావృతం కాకుండా ఉంటాయని అన్నారు.

ఎంఆర్‌సికు స్థల సమస్య

ప్రజాశక్తి - సీతంపేట



ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తున్న ఎంఇఒ, సిబ్బంది

స్థానిక మండల రీసోర్స్ సెంటర్ భవన ఏర్పాటుకు స్థల సమస్య వెంటాడుతుంది. దీంతో ప్రస్తుతం స్థానిక గిరిజన బాలుర ఆశ్రమం పాఠశాలలో ఒక చిన్న గదిలో ఎంఆర్‌సి కార్యాలయం నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల సీతంపేట మండలానికి ఎంఆర్‌సి భవనానికి రూ.53 లక్షలు మంజూరైంది. అంతవరకు బాగానే ఉంది. ఇప్పటికే నెల రోజులు గడుస్తున్నా భవనం ఇంకా ప్రారంభించలేదు. ఎందుకంటే స్థల సమస్య వెంటాడుతుంది. అధికారుల దృష్టికి స్థల సమస్యను తీసుకుని వెళ్లినా ప్రయోజనం కనిపించలేదు. ఇటీవల ఎంఆర్‌పి అధికారులు పిజిఆర్ఎస్‌లో విన్నవించినా స్థలం రెవెన్యూ అధికారులు చూపించలేదు. స్థలం లేకపోవడంతో భవనం నిర్మాణం సాగడం లేదు. దీనిపై ఎంఇఒ ఆనందరావు వద్ద ప్రస్తావించగా, ఇప్పటికే ఐటిడిఎ పిఒకు, తహశీల్దార్‌కు, ఎపిఒకు వినతి పత్రం సమర్పించినా, ఇంతవరకు స్థలం చూపించలేదని సమాధానం ఇచ్చారు.

మూలకు చేరిన 'చెత్త' వాహనాలు

పట్టించుకోని ఇంజినీరింగ్ ప్రజారోగ్య శాఖ అధికారులు
అవస్థలు పడుతున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపాల్టీ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు ఏర్పాటు చేసిన 30 కాంపేక్టర్ బిన్‌లు, 3 హైడ్రాలిక్ వాహనాలు మరమ్మతులకు గురై మూలకు చేరడంతో పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. 30 వార్డుల పరిధిలో గల 60 కాంపేక్టర్ బిన్‌లు పూర్తిగా మరమ్మతులకు గురై మూలకు చేరడం వల్ల పలు వార్డుల ప్రజలు తమ నివాసాల్లోని చెత్త, వ్యర్థాలను రోడ్లపైనే వేస్తుండడంతో ఆ పరిసర ప్రాంతాలు అపరిశుభ్ర వాతావరణంలో ఉండడమేకాక, ఆ వ్యర్థాలను రోడ్లపై సంచరించే పశువులు, కుక్కలు, పందులు చిందర వందర చేయడంతో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఉన్న రెండు హైడ్రాలిక్ కాంపేక్టర్ వాహనాలు మరమ్మతులకు గురవ్వడంతో ఒక వాహనానికి మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు రూ.1లక్ష 55 వేలు వెచ్చించి మరమ్మతులకు సంబంధిత మెకానిక్‌కు డబ్బులు చెల్లించినా వాడుకలోకి తీసుకురాకుండానే మున్సిపల్ కార్యాలయం వెనుక మూలకు చేర్చారు. రెండో వాహనానికి మరమ్మతులు చేసేందుకు మెకానిక్ షెడ్‌లో వదిలేశారు. దీంతో పట్టణ పారిశుధ్య నిర్వహణ పడకేసిందని చెప్పవచ్చు. పట్టణంలో పారిశుధ్య కార్మికులు సేకరించిన

మూలకు చేరి కాంపెక్ట్ వాహనాలు

మూలకు చేరి శిథిలావస్థకు చేరిన కాంపెక్ట్ డస్ట్‌బిన్లు

వ్యర్థాలను పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన కాంపేక్టర్ బిన్స్‌లో వేసి హైడ్రాలిక్ కాంపేక్టర్ వాహనంతో డంపింగ్ యార్డ్‌కు తరలించేందుకు పదేళ్ల క్రితం అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న నల్లనయ్య చొరవతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా 60 కాంపేక్టర్ బిన్స్ మున్సిపాలిటీకి తెప్పించి పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణ చేసేందుకు సులభతరం చేశారు. ఈ పదేళ్లలో వీటిలో కొన్ని బిన్స్ పలు కారణాల వల్ల మరమ్మతులకు గురైనప్పటికీ, వాటిని సకాలంలో మరమ్మతులు చేసేందుకు మున్సిపల్ ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు చొరవ చూపించకపోవడంతో అన్ని బిన్‌లు పనికి రాకుండా పోయాయి. దీంతో మరమ్మతుల గురైన బిన్‌ల పక్కనే ఉన్న రోడ్లపై చెత్త, వ్యర్థాలు కుప్పలు, కుప్పలుగా వేయడంతో వాటిని తొలగించేందుకు పారిశుధ్య కార్మికులకు కష్టతరమవుతుంది. ఇప్పటికైనా సంబంధం అధికారులు కొత్త కాంపేక్టర్ బిన్‌లను మున్సిపాలిటీకి తెప్పించి, కార్మికులు చెత్త సేకరణకు సులభతరం చేసి, పట్టణాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచే బాధ్యత మున్సిపల్ అధికారులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఇందిర

పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - వీరఘట్టం

పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర డిమాండ్ చేశారు. ఆదివారం వీరఘట్టంలో పంచాయతీ వర్కర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకూర్మం, టెక్కలి మండలాల్లో ఇఎస్ఐ సౌకర్యం ఉందని, ఇక్కడ మాత్రం ఆ సౌకర్యం లేదన్నారు. పని భారం తగ్గించాలని, వేతనాలు పెంచాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు నిరంతరం పంచాయతీని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నారని, వారి కుటుంబాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రభుత్వం వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. కనీస వేతనం చెల్లించాలన్నారు. ఈ ఏడాది డిసెంబరు 31 నుంచి విశాఖపట్నంలో జరగనున్న ఆలిండియా సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్ ప్రసాదరావు, మజ్జి, చిన్నారావు, వెంకటేశు, రాజు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సిసి రహదారికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలసలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన రహదారి నుంచి పాఠశాల వరకు రూ.నాలుగు లక్షల వ్యయంతో నిర్మించే సిసి రహదారి పనులకు ఆదివారం ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమే ధ్యేయంగా పని చేస్తున్నారని, రహదారుల అభివృద్ధికి కొట్లాది రూపాయలు నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ జోగి భుజంగరావు, ఎంపిపి బొంగు సురేష్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, వట్టిగెడ్డ ప్రాజెక్ట్ చైర్మన్ ఎం.సత్యం నాయుడు, నియోజకవర్గ రైతు అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి నాయుడు, బిజెపురం పిఎసిఎస్ చైర్మన్ సోములు మాస్టర్, సీనియర్ నాయకులు దాసరి రామారావు, మండలంలో ఉన్న కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో టిడిపికి బిగ్ షాక్

ఎమ్మెల్యే తీరు నచ్చక వైసిపిలో చేరికలు
తాత బాబు నాయకత్వంలో 500 కుటుంబాలకు తీర్థం

ప్రజాశక్తి - పార్వతీపురం

సీతానగరం మండలంలో అధికారపార్టీకి గట్టి దెబ్బ తగిలింది. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పనితీరు నచ్చక వైసిపిలోకి వలసలు మొదలైన పరిస్థితి కనిపిస్తోంది. మండల సీనియర్ నాయకులు గూజాల తాతబాబు, మాజీ సర్పంచ్ మంగమ్మ, శ్రీనివాసరావు నాయకత్వంలో నిడగల్లుకు చెందిన 500 కుటుంబాలు టిడిపిని వీడాయి. వారంతా నిడగల్లు నుంచి ఆటోల్లో మాజీ ఎమ్మెల్యే జోగారావు నివాసానికి స్వచ్ఛందంగా ఆదివారం చేరుకుని వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జోగారావు వారికి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బోనెల విజయచంద్ర గెలుపు కోసం సీనియర్ నాయకులు తాతబాబు చిత్తశుద్ధితో పని చేశారు. అయితే ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించిన బోనెల పార్టీ సీనియర్ నాయకులకు కనీస గౌరవం ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీలో చేరిన తర్వాత సీనియర్ నాయకులు తాత బాబు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ఇంతవరకు ఏ సమస్యలను ఎమ్మెల్యే పరిష్కరించలేదన్నారు. పార్టీలో తన లాంటి సీనియర్ నాయకులకు కనీస గౌరవం దక్కడంలేదని చెప్పారు. టిడిపిని వీడడానికి ఇంకా చాలామంది ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు వాస్తవాలు గ్రహిస్తున్నారని, టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలేవీ లేవన్నారు.

మాజీఎమ్మెల్యే జోగారావు సమక్షంలో వైసిపిలో చేరిన టిడిపి నాయకులు

మరికొంత మంది టిడిపిని వీడేందుకు సిద్ధం

సీతానగరం మండలంలో అధికార పార్టీకి రాజీనామా చేయడానికి మరి కొంతమంది సీనియర్ నాయకులు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. గత కొంతకాలంగా ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పనితీరుపై తీవ్ర అసంతృప్తితో నాయకులు రగిలిపోతున్నారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలకు టిడిపిలో కనీస గౌరవం దక్కడం లేదన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - సీతంపేట

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులు ఆచార్య ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్యకు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి శ్రీరాములు మాట్లాడుతూ గణిత శాస్త్రజ్ఞుడైన ఆచార్య షియాలీ రామా మృత రంగనాథన్ గ్రంథాలయాలకు మేలు చేశారన్నారు. ఆయనే ఫాదర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, డాక్యుమెంటేషన్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌గా పేరు పొందారన్నారు. గ్రంథాలయ శాస్త్రానికి ఐదు సూత్రాలు రూపొందించి గ్రంథాలయ వర్గీకరణ, నిర్వహణ సులభతరం చేశారు. కోలన్ క్లాసిఫికేషన్ 'రూపొందించి ప్రపంచ ప్రఖ్యాతి పొందారు. ప్రపంచ దేశాలు కూడా ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి. ఆచార్య రంగనాథన్ పుట్టినరోజును మన భారతదేశ ప్రభుత్వం 'లైబ్రేరియన్స్' డే గా ప్రకటించిందన్నారు. రమణయ్య గ్రంథాలయ పితామహునిగా పేరుగాంచారు. ఆంధ్ర భారత పత్రిక స్థాపించి ఎందరో ఆధునిక కవులకు ప్రోత్సాహం ఇచ్చారన్నారు. భారతీయ భాషలో మొట్టమొదటిగా గ్రంథాలయ సర్వస్వం అన్న మాసపత్రికను ప్రారంభించారు. అయ్యంకి వారు అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘం వ్యవస్థాపకులు 1968 నవంబర్ 14న గ్రంథాలయ వారోత్సవాలకు నాంది పలికారన్నారు. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ బిరుదుతో వెంకట రమణయ్యను సత్కరించిందని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత లైబ్రేరియన్ పి.శ్రీరాములు, గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులచే చదివిస్తున్న లైబ్రేరియన్ సుకన్య

గుమ్మలక్ష్మీపురం : 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. కథలు, నవలలు, వార్తాపత్రికలు విద్యార్థులతో చదివించారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను లైబ్రరియన్ డి.సుకన్య వివరించారు. ప్రతి విద్యార్థి ఖాళీ సమయాల్లో గ్రంథాలయాలకు వచ్చి చదవడం ద్వారా మరింత విజ్ఞానం పెంపొందించుకోవాలని కోరారు. భవిష్యత్తులో చదివే ఉన్నత చదువులు, పోటీ పరీక్షలకు పుస్తక, వార్తాపత్రికల సమాచారం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

మహాసభల పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సీతానగరం

సిఐటియు ఆలిండియా మహాసభలు డిసెంబర్ 31 నుండి జనవరి 4వరకు విశాఖపట్నంలో జరుగుతాయని, వీటిని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, జి.వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యాన మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ప్రాణాలు తెగించి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకొచ్చిందని, ఇది దుర్మార్గమని, కార్మికుల హక్కులు కాలరాస్తుందని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో సిఐటియు ఆలిండియా మహాసభలు పారిశ్రామిక కేంద్రమైన విశాఖపట్నంలో జరగడం ప్రత్యేక ప్రాధాన్యత ఉందని తెలిపారు. కావున కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలన్నారు. ఇలాంటి తరుణంలో జరుగుతున్న సిఐటియు ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, వై.శాంతి కుమారి, జి.గౌరమ్మ, వసంత, లక్ష్మి, కిషోర్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పార్కుకు పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌కు పర్యాటకులు పోటెత్తారు. కార్తీకమాసం అందులో చివరి ఆదివారం కావడంతో పర్యాటకులు జిల్లా నలుమూలల నుంచి వచ్చారు. పార్క్‌లో ఉన్న అందాలను ఆశ్వాదించారు. జలవిహార వద్ద బోట్ షికారు చేశారు. హ్యాంగగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. చిన్నారులు బోటింగ్ చేశారు. సాహసోపేత క్రీడ నిర్వహించారు. ఆర్ డ్రైన్ వెహికల్‌కు పార్కు చుట్టూ సంచరించారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి అందమైన పగోడాలు వద్ద ఫోటో దిగారు.

సకల సౌకర్యాలతో కుశ జలపాతం : కలెక్టర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సకల సౌకర్యాలతో కుశ జలపాతం తీర్చిదిద్దుతామని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లోవముఠా ప్రాంతమైన కుశ గ్రామ సమీపంలో ఉన్న జలపాతాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. పర్యాటక ప్రాంతం అభివృద్ధికి ఈ ప్రాంతం అనుకూలంగా ఉందన్నారు. వెనుకబాటుకు దూరంగా ఉన్న జలపాతాన్ని అభివృద్ధిలోకి తీసుకొస్తామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఉండేందుకు వీలుగా షాపులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం వచ్చేందుకు మోటార్ బైక్‌లు కూడా అందుబాటులో ఉంచుతామని చెప్పారు. అభివృద్ధి ప్రణాళికలు తయారు చేస్తామన్నారు. ఈ పర్యటనలో తహశీల్దార్ శేఖర్, గిరిజన నాయకులు నిమ్మక సింహాచలం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వంద మందికి నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస సత్య సాయి శత జయంతి సందర్భంగా సేవా సంస్థ ఆధ్వర్యంలో వంద కుటుంబాలకు 20కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పంపిణీ చేశారు. సుమారు 5వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జోగి భుజంగరావు, ఎంపిపి బొంగు సురేష్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

2026 సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష కోసం అర్హులైన అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ఉచిత కోచింగ్ పొందాలనుకునే అభ్యర్థులు ఈనెల 13 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు ఈనెల 27న హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవచ్చు, అలాగే 30న టెంటిటివ్ స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందన్నారు. అలాగే డిసెంబర్ 10న టెంటిటివ్ కామెంసెమెంట్ టెస్ట్ ఉంటుదన్నారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించబడతాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు ఫీజు లేదని పేర్కొన్నారు.

నవోదయ మోడల్ టెస్ట్‌కు స్పందన

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రాండ్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం వీరఘట్టం మండల శాఖ యుటిఎఫ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ నవోదయ గ్రాండ్ టెస్ట్‌కు 303 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో టాప్-5 పి.గిరీష్, సిహెచ్ మోక్షజ్ఞ సాయిశ్రీ, ఎస్.సాయితేజ, ఎస్‌వై రోహిత్‌కౌస్, ఎస్ఎం ఇతిక ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు విభాగంలో మాధవన్, రఘుచంద్ర, వరుణ్ సాయి, ఎం.సమన్విత, ఎస్‌కె భరత్ చంద్ర విజేతలుగా నిలిచారు. అలాగే ప్రభుత్వ విభాగంలో ఎస్ఎ మన్విత సాయి దుర్గ, ఎస్.జ్ఞానదీపిక, ఎస్‌జి చేతనశ్రీజ, ఎస్.చాందిని, ఎస్‌వి యశ్వంత్ ఉత్తీర్ణత సాధించారు. జనరల్ విభాగంలో కె.రాఘవ, ఎస్ దామిని, సిహెచ్ వికాస్, గంటా సాయి, సాయి సుదీప్ ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన వారికి కన్సలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎం.పైడిరాజు, కె.గోవిందరావు, బి.దుర్గాప్రసాద్, ఎస్.రాజేశ్వరి, ఎ.స్వామి బాబు, రవి, బి.వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

వీరఘట్టంలో బంగారం చోరీ

ప్రజాశక్తి -వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలోని గెంబలి వీధికు చెందిన తంగుడు నరసింహమూర్తి నివాసంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. 8 తులాల బంగారం, 20 తులాల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. అదే రోజు రాత్రి వీరఘట్టంలోని స్వామి అయ్యప్ప నూతన ఆలయ ప్రారంభోత్సవం కార్యక్రమంలో భాగంగా పూజలో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులు వెళ్లారు. పూజ అనంతరం కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి తలుపులు తెరిచేసరికి తాళాలు పగలగొట్టినట్లు గుర్తించడంతో దొంగతనం జరిగినట్లు తెలుసుకొని వెను వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు, సిఐ ఎ.ప్రసాదరావు, స్థానిక ఎస్ఐ జి.కళాధర్ చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. అలాగే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ కూడా సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు. నరసింహమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరివేసుకొని మృతి చెందిన భీమయ్య

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - సీతంపేట

మండలములో పులిపుట్టి సమీపాన గల ఆర్ఆర్ కాలనీ చినసంకిలి చెందిన లిమ్మల భీమయ్య (48) ఆదివారం సుందరయ్య గూడా సమీపంలో ఉన్న తోటలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కథనం ప్రకారం పులి పుట్టి సమీపంలో ఉన్న చిన్న సంకిలి ఆర్ఆర్ కాలనీ చెందిన లిమ్మల భీమయ్య ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో అప్పులు తాళలేక మనస్థాపం చెంది ఆదివారం ఆవులు మేపునకు తీసుకొని వెళ్లి సుందరయ్యగూడా సమీపానున్న తోటలో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇన్చార్జి ఎస్ఐ షేక్ మస్తాన్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు మృతుడికి భార్య భాగ్యం, కుమారుడు ఉన్నారు.